

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 08-04-2026 | సంపుటి - 27 | సంచిక -316 | రూ : 4 | పేజీలు: 8

ఇరాన్‌లోని భారతీయులకు

## హై అలర్ట్..!

- ఈ రాత్రి ప్రపంచచరిత్రలో కీలక ఘట్టంలా నిలిచిపోతుందన్న ట్రంప్
- ఓ నాగరికత ముగిసిపోతుందని ఇరాన్ కు తీవ్ర హెచ్చరిక
- ఇరాన్ లోని భారత పౌరుల పరిస్థితి పట్ల అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం
- తదుపరి 48 గంటల పాటు ఇళ్లకే పరిమితం కావాలని సూచన
- సైనిక స్థావరాలు, విద్యుత్ కేంద్రాలకు దూరంగా ఉండాలని స్పష్టం



2లో



2లో

కమికాజే డ్రోన్లు సిద్ధం..

## శత్రువులకు ఇక గండమే!

- కమికాజే డ్రోన్లను తయారు చేసిన స్వదేశీ సంస్థ 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ'
- రెండు నెలల్లోనే సైన్యానికి డ్రోన్లను అందించిన వైనం
- గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న డ్రోన్లు

దేశం కోసం నేను, నా ప్రజలు

**ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు**

2లో

ట్రంప్ హెచ్చరిక

## ఇరాన్ అంతమైపోతుంది!

- ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఒప్పందం కుదరకపోతే నాగరికత అంతమవుతుందని హెచ్చరిక
- ట్రూత్ సోషల్‌లో తీవ్రమైన పోస్ట్ చేసిన అమెరికా అధ్యక్షుడు
- పాలన మార్పుతో అద్భుతాలు జరగవచ్చని వ్యాఖ్య
- 47 ఏళ్ల దోపిడీ, అవినీతికి ఈ రాత్రితో ముగింపు అని పేర్కొన్న ట్రంప్



2లో



అరెస్టులు..

## మాకు కొత్త కాదు

- పరిగి భూసేకరణ బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతల నిర్బంధం
- ప్రభుత్వ చర్యలను పిరికిపంద చర్యలుగా అభివర్ణించిన కేటీఆర్
- ఉద్యమ కాలం నుంచి ఇలాంటివి ఎన్నో చూశామని వ్యాఖ్య

2లో

## మేం చేస్తున్నదే చెబుతున్నాం..

- అనుమానముంటే వచ్చి అభివృద్ధిని పరిశీలించుకోవచ్చు
- కేరళ సీఎం విజయన్‌కు రేవంత్‌రెడ్డి సూచన
- ఆయన 120 నెలల పాలన వైఫల్యానికి ప్రతీకని విమర్శ
- కేరళ ఎన్నికల ప్రచారంలో

2లో



ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు

## భారీ వర్ష సూచన

- మూడు రోజుల పాటు ఏపీ, తెలంగాణకు వర్ష సూచన
- ఏపీలో 9 జిల్లాలకు రెడ్ అలర్ట్
- తెలంగాణలో 5 జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరిక

2లో



ఏపీ అగ్నిమాపక శాఖకు

## హైటెక్ హంగులు



2లో

- అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు ప్రభుత్వం శ్రీకారం
- రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, పరికరాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో పెరుగుతున్న హై-రైజ్ భవనాలకు అనుగుణంగా ఆధునికీకరణ జరగాలన్న సీఎం
- ప్రజల ప్రాణాలను కాపాడటమే తొలి ప్రాధాన్యమని అధికారులకు స్పష్టం
- మొత్తం రూ.252.93 కోట్లతో శాఖను బలోపేతం చేసేందుకు ప్రణాళిక



బీఆర్ఎస్ 200 యూట్యూబ్ ఛానళ్లను

## కొనుగోలు చేసింది

- యూట్యూబ్ ఛానళ్లతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్న జూపల్లి
- బీఆర్ఎస్ ప్రచారాలను కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవాలని పిలుపు
- పార్టీ కోసం ప్రతి కార్యకర్త రోజుకు గంట సమయం కేటాయించాలన్న జూపల్లి

2లో

# ట్రంప్ హెచ్చరిక: ఇరాన్ అంతమైపోతుంది!

వాషింగ్టన్/న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో ఒప్పందానికి ఇరాన్ అంగీకరించని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. "ఈ రాత్రికే ఓ నాగరికత మొత్తం అంతమైపోతుంది, మళ్లీ తిరిగి తీసుకురాలేని విధంగా అంతరించిపోతుంది" అని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. "అలా జరగాలని నేను కోరుకోవడం లేదు, కానీ బహుశా అదే జరుగుతుంది" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో 'సంపూర్ణ పాలన మార్పు' జరిగి, వివేకవంతులైన, కొత్త ఆలోచనాపరులు అధికారంలోకి వస్తే విప్లవాత్మకమైన అద్భుతాలు కూడా జరగవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. "ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?" అని ప్రశ్నించారు. ప్రపంచ సుదీర్ఘ, సంక్లిష్ట చరిత్రలోనే ఇది అత్యంత కీలకమైన క్షణాలలో ఒకటని ట్రంప్ అభివర్ణించారు. 47 ఏళ్ల దోపిడీ, అవినీతి, మరణాలకు ఈ రాత్రితో ముగింపు పడుతుందని ఆయన పేర్కొన్నారు. "గొప్ప ఇరాన్ ప్రజలను దేవుడు ఆశీర్వదించాలి" అంటూ తన పోస్ట్‌ను ముగించారు. ట్రంప్ చేసిన ఈ తీవ్రమైన హెచ్చరిక వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటనే దానిపై అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఇరాన్‌లోని భారతీయులకు హై అలర్ట్!

న్యూఢిల్లీ / టెహ్రాన్, ఏప్రిల్ 7 : ఈ రాత్రి తాము చేయబోయే దాడులతో ఓ నాగరికత ముగిసిపోతుందని, ఈ రాత్రి ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక జారీ చేయడం పట్ల భారత కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారత పౌరుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరికలను జారీ చేసింది. రాబోయే 48 గంటల పాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడివారు అక్కడే ఇళ్లకు పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ హెచ్చరికలను భారతీయులందరూ తక్షణం పాటించాలని ప్రభుత్వం కోరింది. రాయబార కార్యాలయం జారీ చేసిన సలహాలో పలు కీలకమైన సూచనలు ఉన్నాయి. "తదుపరి 48 గంటల పాటు మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. అనవసరంగా బయటకు రావద్దు. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి సున్నితమైన ప్రాంతాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వారు పై అంతస్తుల్లో ఉండవద్దు" అని స్పష్టం చేసింది. అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, తప్పనిసరిగా రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన వసతి గృహాలు, హోటళ్లలో ఉన్నవారు తమ గదులను విడిచి బయటకు వెళ్లవద్దని, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 78 తేదీల్లోగా ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ రాత్రికి ఇరాన్ జాతి మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని కూడా ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, వ్యాపారులు, యాత్రికులు సహా భారతీయులందరి భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర సహాయం కోసం రాయబార కార్యాలయం 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మొబైల్ నంబర్లను (+989128109115, +989128109102, +989128109109, +989932179359) అందుబాటులోకి తెచ్చింది. అలాగే cons.tehran@mea.gov.in ఈమెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది. పరిస్థితి వేగంగా మారే అవకాశం ఉన్నందున, పౌరులందరూ అధికారిక ప్రకటనలను నిరంతరం గమనిస్తూ ఉండాలని విజ్ఞప్తి చేసింది.

# కమికాజే డ్రోన్లు సిద్ధం..
# శత్రువులకు ఇక గండమే!

సూరత్/న్యూఢిల్లీ: ఏప్రిల్ 07 భారత సైన్యం తన ఆయుధ సామర్థ్యాన్ని అంతకంతకూ పెంచుకుంటోంది. తాజాగా, శత్రువుల గుండెల్లో నిద్రపోయేలా 'ఆత్మాహుతి డ్రోన్ల' (కమికాజే)ను తన అమ్ములపొదిలో చేర్చుకుంది. ఆధునిక యుద్ధ తంత్రాల్లో కీలక పాత్ర పోషించే ఈ డ్రోన్లను స్వదేశీ సంస్థ కేవలం రెండు నెలల వ్యవధిలోనే సైన్యానికి అందజేయడం విశేషం. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ' అనే సంస్థ సుమారు రూ. 10 కోట్ల ఒప్పందంలో భాగంగా వందలాది ఆత్మాహుతి డ్రోన్లను ఆర్మీ నార్తర్న్ కమాండ్‌కు అప్పగించింది. సరిహద్దుల్లో మారుతున్న భద్రతా సమీకరణాల దృష్ట్యా, ప్రాణనష్టం లేకుండా శత్రువులను తుదముట్టించేందుకు సైన్యం వీటిని అత్యవసరంగా సమకూర్చుకుంది. ఇవి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత గైడెన్స్‌తో లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తాయి. 10 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై ఇవి దాడులు చేయగలవు. గరిష్ఠంగా 2.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగురుతూ శత్రువుల కంట పడకుండా చొచ్చుకెళతాయి. ప్రతి డ్రోన్ సుమారు 2.5 కిలోల వరకు పేలుడు పదార్థాలను మోసుకెళ్లి, లక్ష్యాన్ని తాకిన వెంటనే పేలిపోతుంది. అందుకే వీటిని ఆత్మాహుతి డ్రోన్లు అంటారు. జీపీఎస్ సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో కూడా ఇవి పనిచేస్తాయి. మైనస్ 35 డిగ్రీల గడ్డకట్టే చలిలో కూడా ఇవి సమర్థవంతంగా దాడులు చేయగలవు. సాధారణ సైనికులు వెళ్లలేని కఠినమైన కొండ ప్రాంతాలు, అడవుల్లోకి చొచ్చుకెళ్లి శత్రువుల స్థావరాలను ధ్వంసం చేయడంలో ఇవి దిట్ట. భారత సరిహద్దుల రక్షణలో ఈ డ్రోన్లు ఒక 'గేమ్ చేంజర్'గా మారుతాయని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు. ఉగ్రవాద మూకలను ఏరిపారేయడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

# మేం చేస్తున్నదే చెబుతున్నాం..

హైదరాబాద్: కేరళ ముఖ్యమంత్రిగా పినరయి విజయన్ శకం ముగిసిపోయిందని, ఆయన వైదొలిగే సమయం ఆసన్నమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. పినరయి 120 నెలల పాలనా కాలం వైఫల్యానికి ప్రతీకగా నిలిచిందని దుయ్యబట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏదైతే అభివృద్ధి చేస్తున్నదో.. అదే కేరళ ఎన్నికల ప్రచారంలో చెబుతున్నామని, అనుమానాలుంటే పినరయి విజయన్ తెలంగాణకు వచ్చి పరిశీలించుకోవచ్చని సూచించారు. కేరళలో ఎన్నికల ప్రచారంలో మంగళవారం పలు రోడ్‌షోలలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విజయన్‌పై విమర్శలు గుప్పించారు. ''కేరళలో పంచాయతీరాజ్ వ్యవస్థ విజయం సాధించింది. దానిని మేం అభినందిస్తున్నాం. ఈ వ్యవస్థ విజయం ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలది. మూడింట రెండొంతుల మెజారిటీతో మేం కేరళలో గెలవబోతున్నాం. ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తాం. తెలంగాణలో మాదిరే అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు, స్వీయ ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం వంటివి కేరళలో అమలు చేస్తాం. పినరయి విజయన్‌తోపాటు



కేరళ కమ్యూనిస్టు మహిళా నాయకులను నేను తెలంగాణకు ఆహ్వానిస్తున్నా. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు మేం చేస్తాం. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి.. మేం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చు. ఎన్నికలు కేరళ, తెలంగాణ మధ్య కాదు.. యూడీఎఫ్.. ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నాయి. విజయన్ నాకు రాసిన లేఖలో 201423 మధ్య విషయాలను ప్రస్తావించారు. ఆ కాలంలో పినరయి విజయన్ సన్నిహిత మిత్రుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కేసీఆర్ హయాంలో తప్పులు జరిగినందునే.. తెలంగాణ ప్రజలు ఆయనను మార్చివేశారు. ఇప్పుడు విజయన్‌ను కేరళ ప్రజలు మార్చివేస్తారు. నరేంద్ర మోదీ.. విజయన్ మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు లేవు'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఏపీ అగ్నిమాపక శాఖకు
# హైటెక్ హంగులు

అమరావతి, ఏప్రిల్ 07 : ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. శాఖ ఆధునికీకరణలో భాగంగా మొత్తం రూ.252.93 కోట్లతో చేపట్టిన ప్రణాళికలో తొలి దశగా, రూ.33.25 కోట్ల విలువైన నూతన వాహనాలు, అత్యాధునిక పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జెండా ఊపి కొత్త వాహనాలను సేవలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా అధికారులు కొనుగోలు చేసిన పరికరాలు, వాహనాల పనితీరును ముఖ్యమంత్రికి వివరించారు. తొలి విడతలో భాగంగా రూ.18 కోట్ల వ్యయంతో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంపులు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 అత్యవసర రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను ప్రభుత్వం సమకూర్చింది. కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించుకుని ఈ పరికరాలను అందుబాటులోకి తెచ్చిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడటానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. రాజధానితో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఎత్తైన భవనాల (హైరైజ్ బిల్డింగ్‌లు) నిర్మాణం పెరుగుతున్నందున, వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ ఆధునిక పరికరాలను సమకూర్చుకోవాలని సూచించారు. గతంలో అగ్నిమాపక విభాగంలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేదని, మళ్లీ అదే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సైతం సహాయం చేసిన ఘనమైన చరిత్ర మనకు ఉందని గుర్తుచేశారు. అన్ని సవాళ్లను అధిగమించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా సద్వినియోగం చేసుకుని అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# "బీఆర్ఎస్ 200 యూట్యూబ్ ఛానళ్లను కొనుగోలు చేసింది

హైదరాబాద్, ఏప్రిల్ 07 : అక్రమంగా గడించిన వేల కోట్ల రూపాయలతో బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 200 యూట్యూబ్ ఛానెళ్లను కొనుగోలు చేసి, ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికగా బీఆర్ఎస్ బురదజల్లుతోందని, వీటిని కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేవలం ఇంట్లో కూర్చుంటే అధికారం రాదని, 'మంత్రాలకు చింతకాయలు రాలవు' అనే నిజాన్ని గుర్తించి ఫీల్డ్‌లోకి వెళ్లి పని చేయాలని సూచించారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు, రాష్ట్రంలో పార్టీని నిలబెట్టేందుకు ప్రతి కార్యకర్త రోజుకు ఒక గంట సమయం కేటాయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

# అరెస్టులు మాకు కొత్త కాదు: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 07 : పరిగి భూసేకరణ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టులు, గృహనిర్బంధాలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఆయన 'పిరికిపంద చర్యలు'గా అభివర్ణించారు. పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతు తెలపడం నేరమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ వంటి నేతలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. "అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను ఎదుర్కొన్నాం. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాం" అని స్పష్టం చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల అనుమతి లేకుండా సాగిస్తున్న బలవంతపు భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# దేశం కోసం నేను, నా ప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు

టెహ్రాన్, ఏప్రిల్ 7 : ఇరాన్ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. దేశానికి చెందిన 14 మిలియన్లకు పైగా ఇరాన్ ప్రజలతో పాటు తానూ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాల్పుల విరమణకు పలు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదని అన్నారు. ఇరాన్ కోసమే నిలబడ్డాను, ఇక ముందు కూడా నిలబడతానని పేర్కొన్నారు. ఇరాన్ హర్మూజ్ జలసంధిని తెరవకపోతే ఆ దేశంలోని అనేక స్థావరాలను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈసారి డెడ్‌లైన్ పొడిగింపు ఉండదని, ఇరాన్‌ను తమ బలగాలు ఒక్క రాత్రికే తుడిచి పెట్టేయగలవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు ధీటుగా స్పందించారు. అమెరికా తాత్కాలిక ఒప్పందాలకు



అంగీకరించబోమని, తమ శాశ్వత డిమాండ్లు అంగీకరించాలని చెబుతోంది. తాను, తమ దేశ ప్రజలు ప్రాణత్యాగాలకు కూడా సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం చూస్తుంటే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 07 : తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురవబోతున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఓవైపు మండుతున్న ఎండలు, మరోవైపు వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో విచిత్రమైన పరిస్థితి నెలకొననుంది.

**ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి:**

దక్షిణ కోస్తాంధ్ర, బంగాళాఖాతంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, రాయలసీమ మీదుగా విస్తరించిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. రెడ్ అలర్ట్ జిల్లాల జాబితా: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉంది. భారీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి.

వడగాల్పులు: నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా మనుబోలు, చిల్లకూరు, గూడూరు మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉంది.

**తెలంగాణలో పరిస్థితి:**

భారీ వర్షాలు కురిసే జిల్లాలు: భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం. మోస్తరు వర్షాలు: సూర్యాపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ ఉండకూడదని అధికారులు హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులను గమనించి అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. కోతకు వచ్చిన పంటలు, ఆరబోసిన ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

# టర్కీలో ఇజ్రాయెల్ కాన్సులేట్ వద్ద కాల్పుల కలకలం... ముగ్గురు సాయుధుల హతం

ఇస్తాంబుల్, ఏప్రిల్ 7 : టర్కీలోని ఇస్తాంబుల్‌లో మంగళవారం తీవ్ర కలకలం రేగింది. మూసివున్న ఇజ్రాయెల్ కాన్సులేట్ భవనం వెలుపల పోలీసులకు, దుండగులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు దాడి చేసిన వ్యక్తులు హతమయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. బెసిక్తాస్ జిల్లాలోని కాన్సులేట్ భవనం వద్ద ఈ కాల్పులు చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. టర్కీ అంతర్గత వ్యవహారాల మంత్రి ముస్తఫా సిఫ్టీ ఈ ఘటనపై స్పందిస్తూ.. పోలీసులతో సాయుధ పోరాటానికి దిగిన ముగ్గురు వ్యక్తులను మట్టుబెట్టినట్లు ధృవీకరించారు. హతమైన ఉగ్రవాదుల వివరాలను గుర్తించినట్లు వెల్లడించారు. వారు ఇజ్మిత్ నుంచి అద్దె వాహనంలో ఇస్తాంబుల్ వచ్చినట్లు తెలిపారు.

# ప్రజానాట్యమండలి నల్లగొండ జిల్లా 8వ మహాసభలు

* జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజానాట్యమండలి జిల్లా 8వ మహాసభ జిల్లా కేంద్రంలోని యుటిఎఫ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రజానాట్యమండలి కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి కార్యదర్శులు వర్గ సభ్యులు ఆమనగంటి ఐలయ్య చింతల విజయ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభ కి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ పాల్గొని మాట్లాడుతూ దశాబ్దాల ప్రజా చైతన్య ప్రవాహం ప్రజానాట్యమండలి కళకళ కోసం కాదు కళ ప్రగతి కోసం అనే నినాదంతో వీధి నాటకం పోరాట ఆయుధం గా మలచుకొని ప్రజల చైతన్యం కోసం నిరంతరం పాటయి ఆటై ముందుకు సాగుతుందన్నారు. సినారె నీటికి చైతన్యం చలనం నిప్పుకు చైతన్యం జననం ప్రకృతికైనా సామాజిక సమాజానికైనా ఈ చైతన్యమే పురోగమనం సాధనం అని వారన్నారు. ఆ చైతన్యానికి ప్రతిరూపంగా 82 వసంతాలలో ప్రజా జీవితంలో విడదీయరాని భాగమై వ్యక్తీకరించి ఓ సువిశాల మధ్యమం ప్రజానాట్యమండలని వారన్నారు. ప్రజా శ్రామిక సోదరుల నుండి పుట్టిన జానపద గ్రామీణ కలలు ప్రపంచీకరణ పడక నీడలో వస్తున్న వింత పోకడల్లో నిర్వీర్యం అవుతున్నాయని, మానవత్వ మానవ సంబంధాలు కుటుంబ జీవన వ్యవస్థలు తిరోగమనములు పయనిస్తున్నాయన్నారు. ఆటపాటలతోనే జీవన వృత్తిగా మంచుకున్న ఈ నేపథ్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న పోరాటాల గడ్డ నల్లగొండ జిల్లా 8వ మహాసభలు జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు అవ్వారి గోవర్ధన్, ఎం జె వినోద్ కుమార్,ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు మాద సైదులు, పుట్టల సైదులు సహాయ కార్యదర్శి పల్లె ప్రసాద్, బట్టు రామచంద్రం, రామచంద్రం జిల్లా కమిటీ సభ్యులు చిలుకూరు బిక్షం ఏర్పుల కవిత గోగు అంజయ్య, అమలాపురం సుమలత పోలేని నరేష్, దండు శంకర్, దండు సాయి, పగిల్ల యాదయ్య, రమణ, జిట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.



## మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదానం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని ప్రముఖ డాక్టర్ మిట్టపల్లి జనార్ధన్ సువర్ణ దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం వాసవి క్లబ్ కెజిఎఫ్ నల్లొండ,వాసవి క్లబ్ స్ఫూర్తి ఆధ్వర్యంలో, స్థానిక సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మానసిక వికలాంగులకు అన్నదానం పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ తన 25వ వివాహ వార్షికోత్సవాన్ని విద్యార్థుల నడుమ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, సిబ్బంది వరలక్ష్మి, సల్మారాజు, రాజేంద్రప్రసాద్, వాసవి క్లబ్ సభ్యులు మిట్టపల్లి వాత్సవ్, సంతోషిని, మురారిశెట్టి, శంకర్, నందిని, పాల్గొన్నారు.

## రామవరంలో నాకాబంధీ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:పట్టణ పరిధిలోని రామవరంలో కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నాకాబంధీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో రామవరం గోధుమ వాగు వంతెన వద్ద టూ టౌన్ ఎస్ఐలు కె.వెంకన్న, కిషోర్ల ఆధ్వర్యంలో నాకాబంధీ ఏర్పాటు చేసి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. కార్లు, ద్విచక్రవాహనాలను నిలుపుదలచేసి లైసెన్స్, వెహికిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. వాహనదారులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పలు కేసులతో సంబంధం ఉన్న అనుమానాస్పద వ్యక్తులు జిల్లాలో తిరుగుతున్నారని, అంతే కాకుండా గంజాయి రవాణా అధికంగా జరుగుతున్న నేపథ్యంలో పోలీసుల నాకాబంధీ ప్రాధాన్యత సంతరించుకుంది. సుమారు 2 గంటలకు పైగా నాకాబంధీ కొనసాగడంతో గోధుమవాగు వంతెనకు ఇరువైపులా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది బుచ్చిరాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యంపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

: జిల్లా కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న వైద్య సేవలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం అత్యంత కీలకమని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారి, సిబ్బందిపై ఉన్న బాధ్యతగా తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాల్వంచ వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్రస్థాయి అవార్డులను స్వీకరించేందుకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతికి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ప్రతిభ కనబరిచిన 43 మంది ఉద్యోగులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దారా ప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఓ ప్రసాద్ నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజస్వి, వైద్య శాఖ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య, ఎంటమాలజీ, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు హెల్త్ క్యాంప్ ప్రారంభం



కాప్రా, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య, ఎంటమాలజీ మరియు ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల కోసం కాప్రా సర్కిల్ కార్యాలయంలో హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌ను నవారం ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని, ఇలాంటి కార్యక్రమాలు వారికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మ, మెడికల్ ఆఫీసర్ మమత, మేనేజ్మెంట్ రవి, నావారం డీఈఈ రవిచంద్, శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ పాల్గొన్నారు. ప్రసాద్ హాస్పిటల్ నుంచి డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ రామన్ రావు మరియు పారామెడికల్ సిబ్బంది సేవలందించారు.

## గిరిజన ప్రాంతాలకు వైద్య సేవల గౌరవం

* భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అవార్డుల పంట




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన ప్రాంతాల్లో అందిస్తున్న వైద్య సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల్లో జిల్లా విశిష్ట ప్రతిభ కనబరిచింది. జిల్లా డీసీహెచ్ఎస్ డా. రవి బాబు ఆధ్వర్యంలోని టీవీవీపీ ఆసుపత్రులు అత్యధిక అవార్డులు సాధించడం విశేషం. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అవార్డులు ప్రదానం చేశారు. గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించినందుకు ఈ పురస్కారాలు లభించాయి.పాల్వంచ సీఎచ్‌సీ నుంచి డా. శైలేష్ కుమార్ (ఆర్థో), డా. పి. రామ్ ప్రసాద్ (అనస్తీషియా), భద్రాచలం ఏరియా ఆసుపత్రి నుంచి డా. క్రపా విజయ్ (పెడియాట్రిక్స్), నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి అవార్డులు అందుకున్నారు. ఏబీఏఎస్ సేవల్లో ఎ. వెంకటరావు, ల్యాబ్ సేవల్లో డా. రామకృష్ణ ప్రశంసలు పొందారు. మనుగూరు ఏరియా ఆసుపత్రి నుంచి నర్సింగ్ ఆఫీసర్ మానస, ఫార్మాసిస్ట్ శారదకు కూడా అవార్డులు లభించాయి. అదనంగా భద్రాచలం, మనుగూరు, చర్ల ప్రాంతాల్లో ఉత్తమ సేవలకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డా. జి. రవి బాబు సూపరింటెండెంట్లు రామకృష్ణ, గౌరీప్రసాద్, సాయి వర్ధన్‌లతో కలిసి మూడు అవార్డులు అందుకున్నారు.జిల్లా టీవీవీపీ ఆసుపత్రులు ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందగా, తాజా అవార్డులు గిరిజన ప్రాంతాల్లో అందిస్తున్న వైద్య సేవల ప్రతిష్ఠను మరింత పెంచాయి.

## గత ప్రభుత్వం కేవలం 'దంపుడు ఉపన్యాసాల'కే పరిమితమై అభివృద్ధిని గాలికొదిలేసింది

* ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : గత ప్రభుత్వం కేవలం 'దంపుడు ఉపన్యాసాల'కే పరిమితమై అభివృద్ధిని గాలికొదిలేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. సుమారు 12 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న 9 కిలోమీటర్ల బీటీ రోడ్డు విస్తరణ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం భూమి పూజ చేశారు. రాయికల్ సర్పంచి జ్యోతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాయికల్ కమాన్ వద్ద వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, ఎమ్మెల్యే స్వయంగా జెసిబితో పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాయికల్ నుంచి విట్యాల వరకు అత్యంత కీలకమైన రహదారి నిర్మాణానికి మోక్షం లభించిందన్నారు. ప్రసిద్ధి గాంచిన రామేశ్వరం దేవాలయానికి వచ్చే వేలాది మంది భక్తులు, స్థానిక ప్రజలు రహదారి సరిగ్గా లేక ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే ఈ రోడ్డు వేశారని, మళ్ళీ ఇప్పుడు తమ ప్రభుత్వంలోనే దీనికి మహర్దశ పట్టిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, ఫరక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కంసాన్పల్లి మాజీ ఎంపిటిసి శేఖర్, రామేశ్వరం సర్పంచ్ మానస సురేష్, అన్నారం సర్పంచ్ లావణ్య రామకృష్ణ, కడియాల కుంట తండా సర్పంచ్ రాజు నాయక్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్, కంసాన్పల్లి సర్పంచ్ గీత యాదయ్య, మాజీ సర్పంచులు ఆశన్న గౌడ్, పాండు నాయక్, కృష్ణయ్య, రాజు నాయక్, రాములు గౌడ్, పెంటయ్య, శివ, రాఘవేందర్ గౌడ్, సంపత్, పార్టీ నాయకులు ముబారక్, సీతారాం, గోపీనాయక్, మైనార్టీ నాయకులు సమద్, రాయికల్, రామేశ్వరం, అన్నారం, విట్యాల, కంసాన్పల్లి, కడియాల కుంట తదితర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం


* ఎమ్మెల్యే మేఘారెడ్డి



ప్రజాస్ఫూర్తి, వనపర్తి జిల్లా : ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, కల్యాణ లక్ష్మి చెక్కులు, షాది ముబారక్ చెక్కులను ఎప్పటికప్పుడు అర్హులైన లబ్ధిదారులకు అందిస్తూ వారికి ఎంతో తోడ్పాటును అందిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నిరుపేదల అభ్యున్నతి కోసం ఎంతగానో పాటుపడుతుందన్నారు. ఒక్కో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారునికి 5 లక్షల రూపాయలు చెల్లించి వారి సొంతింటి కల నెరవేరుస్తుందని, దాంతో ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక నానా ఇబ్బందులు పడిన నిరుపేదలు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సొంత గూడు ఏర్పాటు చేసుకున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. అలాగే రేషన్ కార్డు లేని ప్రతి నిరుపేదకు రేషన్ కార్డు ఇచ్చి వారికి సన్న బియ్యం పంపిణీ చేస్తూ నిరుపేదల ఆకలి తీరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా వనపర్తి నియోజకవర్గం పరిధిలోని 8 మండలాలు, రెండు మున్సిపాలిటీలకు సంబంధించి 178 మంది కళ్యాణ లక్ష్మి షాది ముబా రక్ లబ్ధిదారులకు ఆయన ఒక లక్ష 16 రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు పొందిన లబ్ధిదారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, అధికారులు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వనపర్తి పట్టిన కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రతకు 'టీసేఫ' కవచం

* ముస్తాబాద్ ఎస్.ఐ సిహెచ్.గణేష్




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రజల రక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని ముస్తాబాద్ ఎస్.ఐ సిహెచ్. గణేష్ తెలిపారు. మంగళవారం ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ గణేష్ పాల్గొని ప్రజలకు అత్యవసర సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'టీసేఫ' అప్లికేషన్ ప్రతి మహిళా ఫోన్ లో ఉండాలని సూచించారు. ఆపద సమయంలో ఈ యాప్‌లోని ఎసఓఎస్ బటన్ నొక్కితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుందని, తద్వారా పోలీసులు తక్షణమే స్పందిస్తారని వివరించారు. అలాగే పోలీస్, ఫైర్, అంబులెన్స్ వంటి ఏ అత్యవసర సేవకైనా 'డయల్ 112' నంబర్‌కు కాల్ చేయాలని ఎస్.ఐ గణేష్ కోరారు. ఈ సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయని, జీపీఎస్ ద్వారా బాధితుల లొకేషన్‌ను గుర్తించి వేగంగా చేరుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## మహిళల భద్రతే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం

* షీ టీమ్స్, ఎహెచ్‌టియు కార్యాలయాల్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:మహిళలపై లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, బ్లాక్‌మెయిలింగ్, ఇతర ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలు జిల్లా షీ టీమ్స్‌ను నేరుగా సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం చుంచుపల్లిలోని షీ టీమ్స్, ఎహెచ్‌టియు కార్యాలయాలను ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు. కార్యాలయాల పరిసరాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను అడ్డుకొని వారికి న్యాయం చేయడానికి వీలుగా ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తరపున ఏర్పాటు చేసిన టిజిడబ్ల్యూఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేకమైన విభాగమే షీ టీమ్స్ అని తెలిపారు. షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గొప్యంగా ఉంచబడతాయని అన్నారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే నేరస్తుడిని షీ టీం కార్యాలయానికి పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని, పరిస్థితిని బట్టి నిందితుడిపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బాలికలకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా షీ టీమ్స్‌ను సంప్రదించాలని కోరారు. మానవ అక్రమ రవాణా చేసి వారి అవయవాలను విక్రయించడం, వారితో వెట్టిచాకిరీ చేయించడం, వ్యభిచారంలోకి లాగడం, బాల్య వివాహాలు చేయడం లాంటివి జరగకుండా సిబ్బంది భాద్యతగా పనిచేయాలని సూచించారు. ఇటువంటి నేరాలు జరగకుండా ఉండడానికి నిరంతరం జిల్లా మొత్తం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, షీ టీం ఏఎస్సై నాగయ్య, షీ టీం సభ్యులు మల్లికాంబ, రాంబాబులు పాల్గొన్నారు.


వీధి కుక్కల బెడద నివారణపై చర్యలు

## వెటర్నరీ అధికారులతో బొంతు శ్రీదేవి యాదవ్ భేటీ



కాప్రా , ప్రజాస్ఫూర్తి: వేసవి కాలం దృష్ట్యా చర్లపల్లి డివిజన్ వ్యాప్తంగా పెరుగుతున్న వీధి కుక్కల సమస్యను అరికట్టేందుకు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కాప్రా హెడ్ వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్‌ను కలిశారు. డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో వీధి కుక్కల వల్ల స్థానికులు, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ మాట్లాడుతూ ఎండ తీవ్రత కారణంగా కుక్కలు ఆవేశంగా మారే అవకాశం ఉండడంతో తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు.చర్లపల్లి డివిజన్‌లో సుమారు 90 శాతం కుక్కలకు స్టెరిలైజేషన్ జరిగిందని, వేసవి కాలంలో వాటికి ఆహారం, మంచినీటి కోసం ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.వీధి కుక్కలకు సకాలంలో సంతాన నిరోధక శస్త్రచికిత్సలు (ఎబీసీ), యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ (ఎఆర్వీ) నిర్వహించడంతో పాటు, సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలతో చర్యలు తీసుకోవాలని చర్చించారు. నివాస ప్రాంతాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## తిరుమలానగర్‌లో రేషన్ వినియోగదారులకు అవగాహన సదస్సు




కాప్ర, ప్రజాస్ఫూర్తి: హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని తిరుమలానగర్ కాలనీలో రేషన్ దుకాణంలో మంగళవారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉప్పల్ సర్కిల్ అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ డి. సంధ్య, డిప్యూటీ తహసిల్దార్ ప్రదీప్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, దినేష్ పాల్గొని రేషన్ పంపిణీ తీరును పరిశీలించారు.స్థానిక డీలర్ మల్లేష్ గౌడ్ దుకాణం వద్ద జరిగిన ఈ సమావేశంలో అధికారులు వినియోగదారులతో నేరుగా మాట్లాడి, బియ్యం నాణ్యత, బరువు మరియు పంపిణీలో ఎదురవుతున్న సమస్యలపై సమాచారాన్ని సేకరించారు. ఈకేవైసీ నమోదు, రేషన్ కార్డుల వినియోగంపై సూచనలు అందించారు. ఫిర్యాదులు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రేషన్ కోసం వచ్చే ప్రజలకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. క్యూలైన్లలో వేచి ఉండే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు ఎక్కువగా తాగాలని అవగాహన కల్పించారు.

# మూడేండ్లలో మేం తెచ్చిన పెట్టుబడులు 7 లక్షల కోట్లు: టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంఘటన్ శ్రీజన్ అభియాన్' కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో, జ్యోతి ప్రజ్వలన అనంతరం నూతన సభ్యులతో టీపీసీసీ చీఫ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్, బీజేపీ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

*** రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులతో హైదరాబాద్ విశ్వవ్యాప్తం**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడుల వెల్లువ కురుస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. "గత బీఆర్ఎస్ పాలనలో పదేళ్లలో ఐటీ మంత్రిగా ఉన్న కేటీఆర్ తెచ్చిన పెట్టుబడులు 10 వేల కోట్లు కూడా దాటలేదు. కానీ, మా ప్రభుత్వం కేవలం మూడు రోజుల్లోనే 5.78 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించింది. మొత్తం మీద సుమారు 7 లక్షల కోట్ల పైచిలుకు పెట్టుబడులతో హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో సగర్వంగా నిలబెట్టాం. 'ఫోర్త్ సిటీ' కాన్సెప్ట్‌తో



అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం" అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

*** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా**

మహబూబ్ నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. "పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోంది. రేపు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తాం" అని హామీ ఇచ్చారు.

## టాస్ ఎవరిది? మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది? ఈ ప్రకటనలతో జాగ్రత్త: సజ్జనార్



ఐపీఎల్ క్రికెట్ ఫీవర్‌ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యక్తులు చేస్తోన్న మోసపూరిత ప్రకటనలపై పోలీసులు అప్రమత్తమయ్యారు. కేవలం డబ్బు కోసం కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు అసత్య ప్రచారాలు చేస్తూ సామాన్యుల్ని తప్పుదోవపట్టిస్తున్నారని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. టాస్ ఎవరిది? మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది? అని ముందే చెబుతామంటూ అమాయకుల్ని తమ ఛానెల్స్‌లో సబ్‌స్క్రైబ్ చేయించుకొని నిలువునా ముంచే బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి నకిలీ ప్రిడిక్షన్ ఛానళ్లలో చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని, కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని ఈ సందర్భంగా సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఈ తరహా ప్రమోషన్ల విషయంలో హైదరాబాద్ సైబర్ క్రైం విభాగం కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు. గత నెల రోజుల వ్యవధిలో 494 పెయిడ్ ప్రకటనలు, వాటిని ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ని బ్లాక్ చేయించినట్లు వెల్లడించారు. ఈ నిఘా నిరంతరం కొనసాగుతుందని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సజ్జనార్ హెచ్చరించారు. ఇలాంటి మోసపూరిత యాడ్స్ మీ దృష్టికి వచ్చినా, లేదా మీరు మోసపోయినా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా http://cybercrime.gov.in వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చన్నారు.

## 200 యూట్యూబ్ చానళ్లను బీఆర్ఎస్ కొనుగోలు చేసింది: జూపల్లి


- **యూట్యూబ్ చానళ్లతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్న జూపల్లి**
- **బీఆర్ఎస్ ప్రచారాలను కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవాలని పిలుపు**
- **పార్టీ కోసం ప్రతి కార్యకర్త రోజుకు గంట సమయం కేటాయించాలన్న జూపల్లి**



హైదరాబాద్, ఏప్రిల్ 7: అక్రమంగా గడించిన వేల కోట్ల రూపాయలతో బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 200 యూట్యూబ్ ఛానెళ్లను కొనుగోలు చేసి, ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికగా బీఆర్ఎస్ బురదజల్లుతోందని, వీటిని కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేవలం ఇంట్లో కూర్చుంటే అధికారం రాదని, 'మంత్రాలకు చింతకాయలు రాలవు' అనే నిజాన్ని గుర్తించి ఫీల్డ్‌లోకి వెళ్లి పని చేయాలని సూచించారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు, రాష్ట్రంలో పార్టీని నిలబెట్టేందుకు ప్రతి కార్యకర్త రోజుకు ఒక గంట సమయం కేటాయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

## హైదరాబాద్‌లో రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం

- **చిలకలగూడ, సనత్ నగర్, ఆదిభట్ల పోలీసుల సంయుక్త ఆపరేషన్**
- **డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడి**
- **నగదు, బైక్, మొబైల్ ఫోన్లు సీజ్ చేసిన పోలీసులు**



హైదరాబాద్, ఏప్రిల్ 7: హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకున్నారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, రూ.64.35 లక్షల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50,000 నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో ఆ తర్వాత డ్రగ్స్ వ్యాపారంలోకి వచ్చారని చెప్పారు.



## అసదుద్దీన్‌కు బహుమతిగా ఇవ్వడానికే మూడు భాగాలుగా జీహెచ్‌ఎంసీ: రామచందర్‌రావు

రాజేంద్రనగర్ (హైదరాబాద్): మేయర్ పదవిని అసదుద్దీన్‌కు బహుమతిగా ఇవ్వడానికే జీహెచ్‌ఎంసీని మూడు ముక్కలుగా విభజించారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. సోమవారం రాత్రి హైదరాబాద్ అత్తాపూర్ సర్కిల్ ఉప్పర్‌పల్లికి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మజ్లిస్‌కు అనుకూలంగా జీహెచ్‌ఎంసీని ఏర్పాటు చేశారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మజ్లిస్‌ను అడ్డుకొనే సత్తా భాజపాకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఒకప్పుడు ఒకటి రెండు సీట్లకు పరిమితమైన కమలం పార్టీ ప్రస్తుతం 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. భవిష్యత్తులో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పి.రాజ్‌భూపాల్‌గౌడ్, టి.శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీధర్, బి.బాల్‌రెడ్డి, ఎన్.మల్లారెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, ఎస్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా



గువహటి/సిల్చార్, ఏప్రిల్ : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమచొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం. "పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటుదారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొదలవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటుదారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం" అని అమిత్ షా పేర్కొన్నారు.

### ఎన్నికలు ఎప్పుడొచ్చినా

## కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కు పరిమితం: హరీశ్ రావు



హైదరాబాద్, ఏప్రిల్ 7: ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలవబోదని, సింగిల్ డిజిట్‌కు పరిమితమవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పరిగి ఇండస్ట్రియల్ పార్క్ బాధితులను కలవడానికి బయలుదేరడంతో పోలీసులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. శంషాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు, ఆ తర్వాత వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని వ్యాఖ్యానించారు. గత రెండున్నరేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సింగిల్ డిపాజిట్‌కు పరిమితమవుతుందని అన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించకూడదని, ఆందోళనలు, ధర్నాలు నిర్వహించరాదని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, విచారణలు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తమను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే అరెస్టు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో రామరాజ్యం లాంటి కేసీఆర్ రాజ్యం వస్తుందని అన్నారు.

### బీఆర్ఎస్ నేతలను నిర్బంధించడంపై

## కేటీఆర్ ఫైర్.. తమకు అరెస్టులు కొత్త కాదని వ్యాఖ్య!



హైదరాబాద్, ఏప్రిల్ 07: పరిగి భూసేకరణ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టులు, గృహనిర్బంధాలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఆయన 'పిరికిపంద చర్యలు'గా అభివర్ణించారు. పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతు తెలపడం నేరమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ వంటి నేతలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. "అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను ఎదుర్కొన్నాం. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాం" అని స్పష్టం చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల అనుమతి లేకుండా సాగిస్తున్న బలవంతపు భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# అలా ప్రకృతిలో ఒడిలో...

# ఓ వీకెండ్

కొందరికి సమ్మర్ టూర్లంటే ఇష్టం. మరికొందరికి మాన్‌సూన్ టూర్లంటే ఇష్టం ఉంటుంది. కానీ, టైం మాత్రం ఉండదు. అందుకే చాలామంది వీకెండ్ టూర్లు ప్లాన్ చేస్తుంటారు. అందుకోసం దగ్గరగా ఉండే ప్రదేశాలను ఎంచుకుంటారు. ఆ లిస్ట్‌లో ఈ జలపాతాలు కూడా ఉన్నాయి. అవేంటో ఒకసారి చూసేయండి.




### మల్లెల తీర్థం

శ్రీశైలానికి 58 కిమీల దూరంలోని నల్లమల్ల అడవుల్లో ఉంది మల్లెల తీర్థం జలపాతం. ఇది హైదరాబాద్‌కు 170 కిమీల దూరంలో ఉంది. ఈ జలపాతంలో స్నానాలు చేయాలంటే దాదాపు 250 మెట్లు దిగి కిందికి వెళ్లాలి. వర్షా కాలంలో ఈ ప్రాంతం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అయితే, నీటిలో దిగడం ప్రమాదకరం!




### కవ్వాల్ వైల్డ్ లైఫ్ సాంక్చురీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రకృతి రమణీయత గల ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. కుంతల రాజ్యం నాటి కుంటాల జలపాతం, బోథ్ పొచ్చెర జలపాతం, కవ్వాల్ వైల్డ్ లైఫ్ సాంక్చురీ జంగల్ సఫారీ, బాసర సరస్వతి దేవాలయం, శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్, నిర్మల్ కొయ్యబొమ్మలు మొదలైనవి ఎన్నో చూడవచ్చు. హైదరాబాద్ నుంచి సుమారు 250 కిలోమీటర్ల పరిధిలో ఈ పర్యాటక ప్రదేశాలున్నాయి. ఇక్కడికి చేరుకోడానికి ప్రసిద్ధ నేషనల్ హైవే 44తో విశాలమైన రోడ్డు కనెక్టివిటీ ఉంది.




### ఎత్తిపోతల జలపాతం

ఇది నగరానికి 173 కిమీల దూరంలో ఉంది. నాగార్జున సాగర్ నుంచి 14 కిమీలు ప్రయాణిస్తే ఎత్తిపోతల వస్తుంది. కృష్ణానది ఉపనది అయిన చంద్రవంక నది 70 అడుగుల ఎత్తు నుంచి దూకుతూ ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. వర్షకాలంలో ఈ జలపాతం చాలా వేగంగా ప్రవహిస్తుంది. ఇక్కడ స్నానాలు చేయడం ప్రమాదకరం.




### భీముని పాదం జలపాతం

హైదరాబాద్‌కు 200 కిమీల దూరంలో వరంగల్ జిల్లాలోని గూడూరు మండలం.. సీతానాగారం సమీపంలో ఈ జలపాతం ఉంది. వరంగల్ నుంచి 51 కిమీల దూరంలో ఉన్న ఈ జలపాతం ఆహ్లాదకరంగా, ఆకర్షనీయంగా ఉంటుంది. ఇక్కడ అన్ని కాలాల్లో నీరు ఉంటుంది.



# రెండింటికీ ఒకటే సొల్యూషన్



రోజ్ వాటర్ అంటే గులాబీ రేకుల నుంచి తయారయ్యే నీరు. ఈ వాటర్‌ని సౌందర్యసాధనంగా వాడతారు. ఇప్పటికే చాలామంది రోజ్ వాటర్ చర్మానికి వాడుతూనే ఉండొచ్చు. అయితే, దీనివల్ల జుట్టుకు కూడా చాలా మేలు జరుగుతుందని తెలుసా! అవును.. రోజ్ వాటర్‌తో చర్మానికే కాదు.. జుట్టు సమస్యలకు కూడా చెక్ పెట్టేస్తుంది. అదెలాగో తెలుసుకుందాం.

### చర్మానికి :

రోజ్ వాటర్ నేచురల్ హైడ్రేటర్‌గా పనిచేస్తుంది. ఇది చర్మం పొరల లోతుల్లోకి వెళ్లి, కాంతివంతంగా చేస్తుంది. అంతేకాదు.. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రాపర్టీలు కూడా ఉన్నాయి. అవి చర్మం మీద దురద, దద్దుర్లు, మచ్చలు, డెర్మటైటిస్, ఎగ్జిమా వంటివాటిపై ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. అలాగే రోజ్ వాటర్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు స్కిన్ సెల్స్ డ్యామేజ్ కాకుండా సంరక్షిస్తుంది. వయసు పెరిగిన ఆనవాళ్లను తెలియకుండా చేస్తుంది. ముడతలు కనపడకుండా చేస్తుంది. ఇవే కాకుండా.. రోజ్ వాటర్ పీహెచ్ స్థాయిలను కంట్రోల్ చేయడంలో సాయంచేస్తుంది. దాంతో ఆయిల్ ఎక్కువగా ఉత్పత్తి కాకుండా కంట్రోల్ చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ ప్రాపర్టీస్ గాయాలను మాన్పేందుకు తోడ్పడుతుంది. ఎఫెక్ట్ అయిన ప్రాంతంలో ఇన్‌ఫెక్షన్ కాకుండా శుభ్రంగా ఉంచుతుంది.

### ఎలా వాడాలంటే..


చర్మానికి రోజ్ వాటర్‌ని టోనర్‌లా వాడాలి. ఎక్కడైతే అప్లయ్ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంతాన్ని ముందుగా శుభ్రం చేయాలి. తర్వాత కాటన్ పాడ్‌తో అప్లయ్ చేయాలి. అలాగే దీన్ని మేకప్ రిమూవర్‌గా కూడా వాడొచ్చు. అందుకోసం కొబ్బరి నూనెలో రోజ్ వాటర్ వేసి కలపాలి. దాంతో ఎఫెక్టివ్ మేకప్ రిమూవర్‌గా పనిచేస్తుంది. అంతేకాదు.. స్ప్రేలా కూడా వాడొచ్చు. రోజ్ వాటర్‌ని స్ప్రే బాటిల్‌లో పోసి ముఖంపై స్ప్రే చేయాలి. దీంతో మేకప్ చూడ్డానికి ఫ్రెష్‌గా కనిపిస్తుంది. ఇవేకాకుండా రోజ్ వాటర్‌ని తేనె, పెరుగు వంటివాటితో కలిపి ఫేస్ మాస్క్‌లా కూడా వాడొచ్చు. మచ్చలు పడతాయనిపిస్తే ఆ చోట రోజ్‌వాటర్‌ని నేరుగా అప్లయ్ చేయొచ్చు. ఇది వాడటం వల్ల మొటిమలు రావు.

### జుట్టుకి

జుట్టుకి రోజ్ వాటర్ వాడితే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. మృదువుగా, మెరిసేలా చేస్తుంది. చుండ్రుని తగ్గిస్తుంది. కుదుళ్లకు బలాన్నిస్తుంది. పుర్రె భాగంలో పీహెచ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. దాంతో ఆయిల్ ప్రొడక్షన్ ఎక్కువ కాకుండా చేస్తుంది. నేచురల్ సెంట్‌లా కూడా పనిచేస్తుంది.

### ఇలా వాడాలి

షాంపూ, కండిషనర్ వాడిన తర్వాత చివరిగా రోజ్ వాటర్‌తో కడగాలి. పుర్రె భాగానికి రోజ్ వాటర్‌ని నేరుగా అప్లయ్ చేసి మర్దన చేయాలి. అలా చేస్తే చుండ్రు తగ్గుతుంది. జుట్టు పెరగడానికి ఉపయోగపడుతుంది. అలాగే రోజ్ వాటర్‌ని స్ప్రే బాటిల్‌లో పోసి రోజంతా హెయిర్ మిస్ట్‌గా వాడొచ్చు. రోజ్ వాటర్ కొన్ని చుక్కలు రెగ్యులర్‌గా వాడే కండిషనర్‌లో వేసుకుంటే మాయిశ్చరైజర్‌లా పనిచేస్తుంది. అంతేకాదు.. రోజ్ వాటర్‌ని గ్లిజరిన్‌తో కలిపి వాడితే, మాయిశ్చర్‌లా కనిపిస్తుంది. జుట్టు మెరిసేలా చేస్తుంది.



# బ్రేకప్ తర్వాత...

**ఈ రోజుల్లో ప్రేమలో పడడం చాలా సహజం. కానీ, అన్ని ప్రేమలూ విజయవంతం కావు. కొన్ని మధ్యలోనే బ్రేక్ అవుతాయి. అయితే, బ్రేకప్ తర్వాత లైఫ్‌లో ఎలా ముందుకెళ్లాలో, మునుపటిలా లైఫ్‌ని ఎలా లీడ్ చేయాలో అర్థంకాక డైలమాలో ఉంటారు. కొందరు ఈ స్టేజీలోనే డిప్రెషన్‌కి కూడా గురవుతుంటారు. మరి దీనికి సొల్యూషన్ ఏంటి? బ్రేకప్ తర్వాత నార్మల్ లైఫ్ లీడ్ చేయాలంటే ఏం చేయాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవే.**

1. బ్రేకప్ తర్వాత మాజీ ప్రేమికులతో కాంటాక్ట్ ఉండకూడదు. మెసేజ్, ఫోన్ కాల్, సోషల్ మీడియా ద్వారా గానీ.. ఎలాంటి కమ్యూనికేషన్ మెయింటెయిన్ చేయకూడదు. ఎందుకంటే.. ఏదో ఒకరకంగా ఇంటరాక్షన్ ఉంటే మీ మాజీ లవర్ పాతగాయాల్ని రేపడానికి ప్రయత్నిస్తారు. తిరిగి మిమ్మల్ని వాళ్ల లైఫ్‌లోకి రప్పించుకునేందుకు రకరకాలుగా ప్రయత్నిస్తారు. అదే కాంటాక్ట్ లేకుండా దూరంగా ఉంటే.. మనసుకు తగిలిన పాతగాయాలు త్వరగా మానిపోతాయి. అప్పుడు మీ మీద మీరు ఫోకస్ చేయగలుగుతారు. కొత్త లైఫ్ స్టార్ట్ చేస్తారు.

2. మాజీ లవర్‌కి సంబంధించిన వస్తువులు ఏమైనా ఉంటే వాటిని తీసి పారేయాలి. అది మీకు కష్టంగా, సవాలుగా అనిపించొచ్చు. కానీ అలా చేసి తీరాలి. అప్పుడు మీ చుట్టు కొత్త వాతావరణం ఏర్పడుతుంది. ఈ పని చేసేందుకు మీరు బాగా నమ్మే వాళ్ల సాయం తీసుకోండి. వాళ్లు మీకు ఎమోషనల్‌గా కూడ సపోర్ట్ చేస్తారు.

3. బ్రేకప్ వల్ల మిమ్మల్ని మీరు అర్థం చేసుకునే అవకాశం దొరుకుతుంది. పర్సనల్ గ్రోత్‌కి ఆస్కారం ఉంటుంది. ఏం జరిగింది? అనేది మీ అనుభవాల ద్వారా లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేయగలుగుతారు. ఈ రిలేషన్ షిప్ నుంచి నేను ఏం నేర్చుకున్నా? అని ప్రశ్నించుకునే సమయం ఇది. మీ భావాలను, ఆలోచనలను ఒక పేపర్ మీద పెట్టండి.

4. బ్రేకప్ తర్వాత సపోర్ట్ సిస్టమ్ అనేది లేకపోతే చాలా కృంగిపోతారు. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడండి. మిమ్మల్ని ప్రేమించేవారితో టైం స్పెండ్ చేయండి. మీకు నచ్చే యాక్టివిటీలు చేయండి. మీ ఫీలింగ్స్ ఇతరులతో షేర్ చేసుకోండి. బాధలో ఉన్నప్పుడు ఒంటరిగా అస్సలు ఉండకండి.

5. ఎమోషన్స్‌ని అణచుకోకండి. మీ భావోద్వేగాలను మీరు ఫీల్ అవ్వండి. ఏడవాలనిపిస్తే ఏడ్చేయండి. అది కోలుకోవడానికి బాగా ఉపయోగపడుతుంది. మీ కోపం, బాధ అన్నీ అందులో వెళ్లిపోతాయి. ఫీలింగ్స్ బయటపెట్టడానికి సిగ్గుపడకండి.

బ్రేకప్ నుంచి కోలుకోవడం అంత ఈజీ అయితే కాదు. కానీ, ఈ చిట్కాలు పాటిస్తే మంచి రిజల్ట్ కచ్చితంగా చూస్తారు. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకోవాలి. గాయం మానాలంటే.. కొంత సమయం పడుతుంది.

## ఆర్బీఐ నిర్ణయానికి ముందు మార్కెట్ల దూకుడు...

# చివరి గంటలో కొనుగోళ్ల జోరు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాల బాటలో పయనించాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 507.73 పాయింట్లు పెరిగి 74,616.58 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 155.40 పాయింట్లు లాభపడి 23,123.65 వద్ద ముగిసింది.

రేపు బుధవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో, ఇవాళ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఆరంభంలో ఆచితూచి సాగినప్పటికీ, చివరి సెషన్‌లో ఐటీ, మెటల్ రంగ షేర్లలో కొనుగోళ్ల జోరు పెరిగింది. దీంతో మార్కెట్లు లాభాలను నిలబెట్టుకున్నాయి. నిఫ్టీలో విప్రో, హిందాల్కో ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్ అత్యధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఈసారి కూడా ఆర్బీఐ రెపో రేటును యథాతథంగా ఉంచుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయినప్పటికీ, భవిష్యత్ విధానాలపై ఆర్బీఐ గవర్నర్ చేసే వ్యాఖ్యల కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇక రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ, మెటల్ సూచీలు రాణించాయి. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది. బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.20 శాతం స్వల్పంగా లాభపడగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.06% మేర నష్టపోయింది. నిఫ్టీకి 23,000 వద్ద తక్షణ మద్దతు ఉందని, 23,500-23,600 స్థాయి వద్ద నిరోధం ఎదురుకావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## చమురు సంక్షోభం.. విమాన టిక్కెట్ల ఛార్జీలు పెంచనున్న ఎయిరిండియా..




**న్యూఢిల్లీ:** చమురు సంక్షోభం ప్రభావం దేశీయ విమానయాన సంస్థలపై పడుతోంది. అంతర్జాతీయంగా విమాన ఇంధన ధరలు పెరుగుతుండటంతో టిక్కెట్ల ఛార్జీలు పెంచాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది. ఏప్రిల్ 8, బుధవారం నుంచే టిక్కెట్ల ఛార్జీల పెంపు నిర్ణయం అమలులోకి రానుంది. డొమెస్టిక్ ఎయిర్‌లైన్స్‌తోపాటు, ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ టిక్కెట్ల ఛార్జీలు కూడా పెరుగుతాయి. ప్రస్తుతానికి కొన్ని ఇంటర్నేషనల్ రూట్లలో మాత్రం ఛార్జీల పెంపు ఉండబోతుంది.

ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సంక్షోభం తలెత్తిన సంగతి తెలిసిందే. హార్ముజ్ జలసంధి మూసివేయడం, ఇరాన్ సహా గల్ఫ్ దేశాల్లో చమురు కేంద్రాలపై దాడులు జరగడం కారణంగా చమురు లభ్యత తగ్గి, ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విమాన టిక్కెట్లపై విధించే ఫ్యూయల్ ఛార్జీలు కనిష్టంగా రూ.299 నుంచి గరిష్టంగా రూ.899కి పెంచాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది. ప్రస్తుతం యుద్ధం కారణంగా ముడి చమురు ధర భారీగా పెరిగింది. విమాన ఇంధన ధరలు కూడా రెట్టింపయ్యాయి. బ్యారెల్ విమాన ఇంధన ధర ఫిబ్రవరిలో 99.40 డాలర్లు ఉండగా, గతవారం 195.19 డాలర్లు ఉంది. ఎయిర్ ఇండియా తాజా నిర్ణయం ప్రకారం నేరుగా టిక్కెట్ల ధరలు కాకుండా ఇంధన సర్ ఛార్జీలు మాత్రమే పెరుగుతాయి. గతంలో ఈ విషయంలో ఫ్లాట్ ఛార్జీలు విధించేవారు. ఇప్పుడు దూరాన్ని బట్టి ఛార్జ్ చేస్తున్నారు. 500 కిలోమీటర్లలోపు దూరానికి అదనంగా రూ.299, 501-1000 కిలోమీటర్లలోపు దూరానికి రూ.399, 1,001-1,500 కిలోమీటర్లలోపు దూరానికి రూ.549, 1,501-2,000 కిలోమీటర్లలోపు దూరానికి రూ.749, 2,000 కిలోమీటర్లకు మించిన దూరానికి రూ.899 అదనంగా చెల్లించాలి. ఏప్రిల్ 8, ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ ఛార్జీలు అమలవుతాయి. ఇందులో పర్ సెక్టార్, పర్ ప్యాసింజర్ అనే రెండు విభాగాలుంటాయి. అంటే ఒక చోటు నుంచి మరో చోటుకు నేరుగా వెళ్తే ఒక సెక్టార్ కింద పరిగణిస్తారు. అదే ఒక ప్రయాణికుడు కనెక్ట్ ఫ్లైట్ ద్వారా రెండు వేర్వేరు విమానాల్లో వెళ్తే రెండు సెక్టార్ల కింద దానికి రెండు ఫ్యూయల్ ఛార్జీలు అమలవుతాయి. దీని ద్వారా డైరెక్ట్ ఫ్లైట్ బుక్ చేసుకుంటే తక్కువ ఛార్జీ పడుతుంది. అదే కనెక్టింగ్ ఫ్లైట్ బుక్ చేసుకుంటే, అదనంగా మరికొంత చెల్లించాల్సి ఉంటుంది.

## 5 కిలోల గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం తీపికబురు




**న్యూఢిల్లీ:** వలస కార్మికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వారికి 5 కిలోల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ రాష్ట్రాలకు లేఖ రాశారు. దేశంలోని చమురురంగ సంస్థల సహాయంతో పౌరసరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు.

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో 5 కిలోల బరువుండే 'ఛోటు' సిలిండర్లను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. పట్టణాలు, నగరాలలో నివసించే వలస కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఈ సిలిండర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ గ్యాస్ కనెక్షన్లకు అడ్రస్ ప్రూఫ్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే 5 కిలోల సిలిండర్‌ను పొందవచ్చు.

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో గ్యాస్ కొరత లేకుండా చూడటం, వలస కార్మికులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు గ్యాస్ కొనాల్సిన అవసరం లేకుండా చూడటమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. చమురు రంగ కంపెనీల ద్వారా ఈ అదనపు సరఫరాను రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయాలని కేంద్రం నిర్ణయించింది.

# రాజస్థాన్ హ్యాట్రిక్ విక్టరీ!

## 11 ఓవర్ల మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన ముంబై..

**గువాహటి:** ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ జట్టు హ్యాట్రిక్ విక్టరీలునమోదు చేసింది. గువాహటి వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన 11 ఓవర్ల మ్యాచ్‌లో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో రాణించి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు 11 ఓవర్లలో 150 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ 77 పరుగులతో నాటౌట్‌గా నిలవడం విశేషం. భారీ టార్గెట్ ఛేజింగ్‌లో ముంబై ఇండియన్స్ 123/9 పరుగులకే పరిమితమైంది. హై టార్గెట్ మ్యాచ్‌లో ముంబై బ్యాటర్లు తడబడి చిత్తుగా ఓడిపోయారు. 11 ఓవర్లలో 151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ తొలి ఓవర్ నుంచే వికెట్లు కోల్పోవడం మొదలుపెట్టింది. మొదటి మూడు ఓవర్లలోనే ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్, రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వికెట్లు కోల్పోయారు. దాంతో ముంబై ఓటమి ఖరారయింది. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ హ్యాట్రిక్ విక్టరీలతో పాయింట్ల పట్టికలో టాప్ ప్లేస్‌కు దూసుకెళ్లింది. ముంబై ఇండియన్స్ ఆశలపై వర్షం నీళ్లు చల్లింది. గువాహటిలో వర్షం కారణంగా 20 ఓవర్ల మ్యాచ్ కాస్త 11 ఓవర్లకు కుదించారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ బౌలింగ్ ఎంచుకుని, రాజస్థాన్‌ను బ్యాటింగ్‌కి ఆహ్వానించింది. రాజస్థాన్ యువ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ ముంబై బౌలర్లను ఊచకోత కోశారు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 80 పరుగులు జోడించడం, జైస్వాల్ 77 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో రాజస్థాన్ రాయల్స్ 11 ఓవర్లలో 150/3 పరుగులు చేసింది. రాజస్థాన్ అందించిన 151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ జట్టు మొదటి ఓవర్‌లోనే ర్యాన్ రికెల్టన్ వికెట్ కోల్పోయింది. రెండో ఓవర్‌లో సూర్యకుమార్ యాదవ్, మూడో ఓవర్‌లో రోహిత్ శర్మ అవుటయ్యారు. ర్యాన్ రికెల్టన్ 4 బంతుల్లో 8 పరుగులు, రోహిత్ శర్మ 6 బంతుల్లో 5, సూర్యకుమార్ యాదవ్ 3 బంతుల్లో 6 పరుగులు చేశాడు. దాంతో 2.3 ఓవర్లలోనే ముంబై ఇండియన్స్ 22 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది.

కెప్టెన్ హార్దిక్ పాండ్యా హిట్టింగ్ చేస్తాడని అనుకున్నా 6 బంతుల్లో 9 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. రూథర్‌ఫోర్డ్ హిట్టింగ్ చేస్తున్నాడు అన్న సమయంలో దేశ్‌పాండే ట్రాప్‌లో చిక్కుకుని వికెట్ కోల్పోయాడు. 8 బంతులు ఆడిన రూథర్‌ఫోర్డ్ 2 ఫోర్లు, రెండు సిక్సర్లతో 25 పరుగులు చేసి అవుటయ్యాడు. నమన్ ధీర్ 13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 25 పరుగులు చేశాడు. శార్దూల్ ఠాకూర్ 7 బంతుల్లో 8 పరుగులు చేశాడు. ఆఖరి ఓవర్‌లో 35 పరుగులు కావాల్సి ఉండగా ముంబై 7 పరుగులు మాత్రమే చేసింది. 11 ఓవర్లలో ముంబై ఇండియన్స్ 123/9 పరుగులు చేయడంతో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో గెలిచింది. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో అందరూ అద్భుతంగా బౌలింగ్ చేయడం విశేషం. జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే చెరో వికెట్ తీయగా.. రవి బిష్ణోయ్, బర్గర్, సందీప్ శర్మ తలో రెండు వికెట్లు పడగొట్టారు.





# బంగ్లాదేశ్ బోర్డు అధ్యక్షుడిగా భారత మద్దతుదారుడు..

## అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డు..!




**ఢాకా:** బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ ఆ దేశ క్రికెట్ బోర్డు అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. అవినీతి ఆరోపణలతో నిత్యం వార్తల్లో నిలుస్తున్న బీసీబీకి కొత్త చీఫ్‌గా తమీమ్‌ను నియమించింది ప్రభుత్వం. అమినుల్ ఇస్లాం నేతృత్వంలోని బోర్డును రద్దు చేసిన ప్రభుత్వం మంగళవారం ఈ మాజీ ఓపెనర్‌కు పగ్గాలు అప్పగించింది. ఇటీవల భారత్‌లో టీ20 ప్రపంచకప్‌ను బాయ్‌కాట్ చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకించిన తమీమ్ బీసీబీ అధ్యక్షుడు కావడంతో బీసీసీఐతో సంబంధాలు మరింత మెరుగయ్యే అవకాశముంది.

నిరుడు అక్టోబర్‌లో జరిగిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఎన్నికల్లో అవకతవకల నేపథ్యంలో కొత్త అధ్యక్షుడి ఎంపిక అనివార్యమైంది. ఎన్నికల్లో అవినీతిపై నిజాలు నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ తదుపరి బోర్డు అధ్యక్షుడిగా మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ పేరును ప్రతిపాదించింది. దాంతో, అమినుల్ ఇస్లాం బృందాన్ని తొలగించిన ప్రభుత్వం తమీమ్‌కు అధికారాలు కట్టబెట్టింది.

ప్రస్తుతం 37 ఏళ్లున్న తమీమ్ ఆ పదవికి ఎంపికైన అత్యంత చిన్న వయస్కుడిగా గుర్తింపు సాధించాడు. 11 మంది సభ్యుల అడ్‌హక్ కమిటీతో కలిసి బంగ్లాదేశ్ క్రికెట్ పురోగతికి తమీమ్ చర్యలు చేపట్టనున్నాడు. మాజీ కెప్టెన్ మిన్హాజుల్ అబెదిన్, మాజీ ఆటగాడు అతర్ అలీ ఖాన్, రష్నా ఇమాన్, మిర్జా యాసిర్ అబ్బాస్, సయ్యద్ ఇబ్రహీం, ఇస్రాఫిల్ తంజిల్ చౌదురి, సల్మాన్ ఇస్పహని, రఫికుల్ ఇస్లాం, ఫహీం సిన్హాలు సభ్యులు.

# సిడ్నీలో డేవిడ్ వార్నర్ అరెస్ట్..



**సిడ్నీ:** ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌ను సిడ్నీ పోలీసులు అరెస్టు చేశారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మీడియాలో కథనాలు వచ్చాయి. మారుబ్రాలో పోలీసులు రోడ్డుపై బ్రీత్ టెస్టింగ్‌ను నిర్వహిస్తుండటం చూసిన వార్నర్ తన కారును రోడ్డు పక్కన పార్కు చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు అతడికి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు చేయగా పరిమితికి మించి మద్యం సేవించినట్లు తేలింది. అతని రక్తంలో అల్కాహాల్ స్థాయి 0.104గా నమోదైంది. ఆస్ట్రేలియాలోని నిబంధనల ప్రకారం అతను పరిమితి కంటే రెట్టింపు మద్యం సేవించాడు. దీనితో మారుబ్రా పోలీసు అధికారులు వార్నర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. అతడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి, అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి వార్నర్ వచ్చే నెలలో కోర్టు ఎదుట హాజరు కావాల్సి ఉంటుంది.

# అంత కోపం అవసరం లేదు..

## నువ్వు ఆడాల్సింది క్రికెట్: రహానెకు సెహ్వాగ్ హితవు





**ముంబై:** ఈ ఐపీఎల్‌లో తన స్ట్రైక్‌రేట్‌పై విమర్శలు చేస్తున్న వారిపై కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానె మండిపడిన సంగతి తెలిసిందే. అతడు స్పందించిన విధానం చాలామందిని ఆశ్చర్యపర్చింది. రహానె తీరుపై భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ అసహనం వ్యక్తం చేశారు. సచిన్ తెందూల్కర్, అమితాబ్‌బచ్చన్ లాంటి వాళ్లు తమపై వచ్చిన విమర్శలకు పనితీరుతో సమాధానమిచ్చిన తీరును గుర్తుచేశాడు.

ఈ ఐపీఎల్ సీజన్‌లో కేకేఆర్ తన తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ చేతిలో 65 పరుగుల తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే. కేకేఆర్ మొత్తంగా మూడు మ్యాచ్‌లు ఆడగా.. రెండింటిలో ఓడింది. సోమవారం కోల్‌కతా నైట్‌రైడర్స్-పంజాబ్ కింగ్స్ పోరు వర్షం కారణంగా రద్దుకావడంతో చెరో పాయింట్ లభించింది. ఈ వరుస ఓటముల కారణంగా రహానె ఫామ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. "ఏదో ఎజెండాతో నాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు" అంటూ రహానె విమర్శకులకు బదులిచ్చిన సంగతి తెలిసిందే. అలాగే ఆస్ట్రేలియా క్రికెటర్, ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్‌ను ఆడించకపోవడంపై అడిగిన ప్రశ్నకు అతడు ఇచ్చిన సమాధానం ఆశ్చర్యపర్చింది. ఈ ప్రశ్న క్రికెట్ ఆస్ట్రేలియాను అడగండంటూ సమాధానం ఇచ్చాడు. ఈ వ్యాఖ్యలపై సెహ్వాగ్ స్పందించాడు.

"ఆటగాళ్లు ఇవన్నీ మాట్లాడాల్సిన అవసరం లేదనుకుంటా. రహానె కెప్టెన్ కాబట్టి..గ్రీన్ గురించి అడిగారు. అతడి దగ్గర సమాధానం లేకపోవడంతో క్రికెట్ ఆస్ట్రేలియాను అడగమని చెప్పాడు. ఆటవిషయంలో విమర్శలు, పొగడ్తలు రెండూ రావొచ్చు. అన్నింటికి తటస్థంగా ఉండాలి. ఇలాంటి వ్యాఖ్యలు చేయాల్సిన అవసరం లేదు. సచిన్ తెందూల్కర్, అమితాబ్ బచ్చన్ వంటి వారు తమపై వచ్చిన విమర్శలను హుందాగా ఎదుర్కొన్నారు. చాలా సందర్భాల్లో వారు మౌనంగా ఉండిపోయేవారు. ఇక తెందూల్కర్ ఈ విషయంలో గొప్ప ఉదాహరణగా నిలుస్తారు. ఒకానొక సమయంలో తెందూల్కర్ ఫామ్ లేకుండా ఇబ్బంది పడ్డాడు. ఒక వార్తాపత్రిక 'ఎండూల్కర్' అని రాసింది. కానీ అతడు తన ఆటతోనే సమాధానం ఇచ్చాడు. కాబట్టి.. మౌనంగా ముందుకు వెళ్లడమే మంచిదని నా అభిప్రాయం. ఒక సెంచరీ చేస్తే.. అందరి నోర్లు మూతపడతాయి. అన్నింటికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదనుకుంటున్నాను" అని సెహ్వాగ్ సూచించాడు.

MOVIE TIME


## అట్లీ, అల్లు అర్జున్
# మూవీ పోస్టర్ విడుదల



టాకీస్: అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ22ఎక్స్ 6'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది. సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతో పాటు... విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు ఉన్నట్లు తెలుస్తోంది.


## పెద్ది విడుదల జూన్‌కు
# మారినట్లేనా?

టాకీస్: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదల తేదీపై గందరగోళం నెలకొంది. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, తాజా పరిణామాలు చూస్తుంటే ఆ తేదీకి రావడం కష్టమేనని ఇండస్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ' ఈవెంట్‌లో నిర్మాత ఎస్‌కేఎన్ సినిమా వాయిదా పడే అవకాశాలపై వ్యాఖ్యలు చేయడంతో మెగా అభిమానులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఆయన తర్వాత వివరణ ఇచ్చారు. మరోవైపు, 'రాకాస' టీంతో మాట్లాడిన సమయంలో 'సినిమా లేట్ అవ్వదు' అని



రామ్ చరణ్ స్వయంగా చెప్పడంతో ఫ్యాన్స్ కాస్త కూల్ అయ్యారు. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తే వాయిదా అనివార్యంగా కనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా జూన్ నెలలో విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ రెండు తేదీలను పరిశీలిస్తోంది. జూన్ 4 లేదా జూన్ 24. ఈ తేదీల్లో ఏదో ఒకదానిని ఫైనల్ చేయాలని భావిస్తున్నారు. త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. కీలక సన్నివేశాల్లో రామ్ చరణ్ పాల్గొంటూ బిజీగా ఉన్నారు. సినిమాను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు టీమ్ కష్టపడుతోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ముఖ్య పాత్రల్లో శివరాజ్ కుమార్, జగపతిబాబు , అలాగే 'మిర్జాపూర్' ఫేమ్ దివ్యేందు శర్మ కనిపించనున్నారు. సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు మంచి స్పందన పొందాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రాగానే ప్రమోషన్స్‌ను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేలా యూనిట్ ప్లాన్ చేస్తోంది.

## అనన్య పాండే మూవీ
# చాంద్ మేరా దిల్




టాకీస్: బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు. మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.



# 'బోగి'పై ఆశలు పెట్టుకున్న డింపుల్

టాకీస్: డింపుల్ హయాతి.. ఈ గ్లామర్ బ్యూటీ తన వయ్యారంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇక తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ అందుకోలేక పోయింది. హీరోయిన్ గానే కాదు.. గెస్ట్ రోల్స్ చేసింది. అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. హాట్ బ్యూటీ డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు. అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర' పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది. కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. రవితేజ సరసన ఈ చిన్నది భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్. బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్ గా ఎంపికైంది. మొన్నామధ్య ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ సినిమా పై డింపుల్ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ



టాకీస్: 'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ప్లాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

## భక్తి, యాక్షన్ కలబోతగా అల్లరి నరేష్ 'కనకదుర్గ'..
### గ్రాండ్‌గా లాంచ్ అయిన మూవీ!





టాకీస్: అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కనకదుర్గ' శనివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో వైభవంగా ప్రారంభమైంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు టెంపుల్ టౌన్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు టాలీవుడ్ నుంచి ప్రముఖులు విచ్చేశారు. మెగాస్టార్ చిరంజీవి భార్య సురేఖ కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిత్ర యూనిట్‌కు క్లాప్ కొట్టారు. దిల్ రాజు కుటుంబ సభ్యులు తేజస్విని, హన్షిత రెడ్డితో పాటు నిర్మాత స్వప్న దత్ కూడా ఈ వేడుకలో సందడి చేశారు.

ఈ సినిమాతో అల్లరి నరేష్ తన కెరీర్‌లో సరికొత్త ప్రయోగానికి సిద్ధమయ్యినట్లు తెలుస్తుంది. ఒకప్పుడు కామెడీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన నరేష్, 'నాంది', 'ఉగ్రం' వంటి చిత్రాలతో తనలోని నటుడిని మరో కోణంలో ఆవిష్కరించారు. ఇప్పుడు 'కనకదుర్గ'తో ఒక హై-ఇంటెన్సిటీ డివోషనల్ యాక్షన్ డ్రామాను మన ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. జీవితంలో తీవ్రమైన ఒడిదొడుకులు ఎదుర్కొన్న ఒక వ్యక్తి, దైవ శక్తిని కలిసినప్పుడు అతని జీవితం ఎలాంటి మలుపు తిరిగింది అనే ఆసక్తికరమైన అంశంతో ఈ కథ సాగుతుంది. బి.వి.ఎస్. రవి ఈ చిత్రానికి కథను అందించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. కాజల్ చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సుబ్బరాజు ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. తెలుగు సంస్కృతి, ఆధ్యాత్మికత మేళవింపుతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ నరేష్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

## అవును పెళ్లయ్యింది....
# నలుగురు పిల్లలు
### విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై

టాకీస్: కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు. ప్రస్తుతం ఆమె సూర్య 'కరుప్పు'(తెలుగులో 'వీరభద్రుడు'), 'విశ్వంభర'లో నటిస్తున్నారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.